సాక్షి
మంచిర్యాల
మంగళవారం । 7 । ఫిబ్రవరి । 2023



### చీటర్స్‌పై నిఘా!



సోషల్ చీటర్ల ఆగడాలకు కళ్లెం వేసేందుకు పోలీస్ అధికారులు కేసులు నమోదు చేస్తున్నారు. ఇప్పటికే కమిషనరేట్ పరిధిలో 82 కేసులు నమోదు కాగా 85 మందిని అరెస్ట్ చేశారు. 10లో▸



### ప్రజావాణికి స్పందన అంతంతే..

మండలాల్లో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి స్పందన కరువైంది. సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో ప్రజలు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. 11లో▸

గరిష్టం/కనిష్టం
32.0 /17.0

### వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. వాయువ్యం దిశగా చలిగాలులు వీస్తాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

# అరకొర నిధులు!

- సాగునీటి ప్రాజెక్టులకు తప్పని తిప్పలు
- గూడెం, చెన్నూరు ఎత్తిపోతల పథకాల ఊసే లేదు
- రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాకు ప్రత్యేక ప్రతిపాదనలు లేవు
- సంక్షేమ పథకాలతోనే జిల్లా వాసులకు ఊరట

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాకు ప్రత్యేకంగా ఒరిగేందేమీ లేదు. సాగునీటి ప్రాజెక్టులకు అరకొర నిధులే ప్రతిపాదించారు. ఈ ప్రాంత అభివృద్ధిపై ఎటువంటి ప్రస్తావన కనిపించలేదు. సోమవారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు 2023–24 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఆయన ప్రసంగంలో పలు జిల్లాల ప్రస్తావన వచ్చినప్పటికీ ఈ ప్రాంతాన్ని విస్మరించారు. సింగరేణి కార్మికవర్గానికి గతంలో ఇచ్చిన హామీలు, నిరుద్యోగ యువతకు భృతి వంటివి బడ్జెట్‌లో కనిపించలేదు.

**గూడెం, చెన్నూరు ఎత్తిపోతలపై ఊసే లేదు**

గోదావరి, ప్రాణహిత పక్కనే పారుతున్న జిల్లాలో సరైన సాగునీటి పారుదల సౌకర్యాలు లేక రైతులు అవస్థలు పడుతున్నారు. 30వేల ఎకరాలకు ఆయకట్టు ఉన్న గూడెం ఎత్తిపోతల పథకం తరచూ పైపులైన్లు పగిలిపోయి రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో సగం ఆయకట్టుకు నీరందడం లేదు. శాశ్వత పరిష్కారం కోసం నిధులు కేటాయిస్తారని ఆశగా ఎదురుచూసిన రైతులకు నిరాశే ఎదురైంది. ఇక ప్రతిపాదిత చెన్నూరు ఎత్తిపోతల పథకంపై ఎటువంటి ప్రస్తావన లేదు. గత ఏడాది బడ్జెట్‌లో ఈ ఎత్తిపోతల పథకం కోసం టెండర్లు పిలుస్తామని ప్రకటించారు. ఈ ఏడాది బడ్జెట్‌లోనూ చెన్నూరు లిఫ్టుల ప్రస్తావన రాలేదు. దీంతో చెన్నూరు నియోజకవర్గ రైతులు నిరాశలో ఉన్నారు. మరోవైపు జిల్లాలోని ప్రతిపాదిత సాగునీటి ప్రాజెక్టులకు సైతం అరకొర నిధులే ప్రతిపాదించారు. గతంలో ప్రకటించిన నిధులు సైతం విడుదల కాక అనేక పనులు పెండింగ్‌లోనే ఉంటున్నాయి. ఈ ఏడాది రెండుసార్లు పంట మునిగి, ప్రాణహిత, గోదావరి తీర ప్రాంతాల రైతులకు నష్టం వాటిల్లింది. పరిహార ప్రస్తావన రాలేదు.

**సంక్షేమ పథకాలే దిక్కు**

రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ పథకాల అమలుతో జిల్లాలో ఆయా వర్గాల వారీగా లబ్ధి చేకూరనుంది. 'దళిత బంధు'లో మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు, ఖానాపూర్(జన్నారం) మండలాల్లో ఒక్కో నియోజకవర్గంలో వంద మంది చొప్పున దళిత బంధు యూనిట్లు అందాయి. ఈ బడ్జెట్‌లో రూ.17,700కోట్లు ప్రతిపాదించడంతో జిల్లాలో మరికొందరికి అందనుంది. ఎస్సీల ప్రగతి కోసం రూ.36వేల కోట్లు, ఎస్టీల ప్రగతి కోసం రూ.15,233 కోట్లు కేటాయించారు. సొంత జాగా ఉంటే ఇంటి నిర్మాణం కోసం రూ.3లక్షల రుణం, రాష్ట్రంలో మరో 60జూనియర్, సీనియర్, జిల్లా జడ్జి కోర్టులను ఏర్పాటు చేస్తామని ప్రకటించడంతో జిల్లాలోనూ కోర్టు ఏర్పాటయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆసరా పింఛన్లు రూ.12వేల కోట్ల కేటాయింపులతో జిల్లాలోని 1.04లక్షల మందికి ఆసరా పింఛన్లు అందనున్నాయి. విద్యాశాఖకు రూ.19,093 కోట్ల కేటాయింపుతో జిల్లాలోని సర్కారు బడులు మెరుగు పడనున్నాయి. కల్యాణలక్ష్మీకి రూ.3,210 కోట్లు, బీసీ సంక్షేమానికి రూ.6వేల కోట్లతో సంక్షేమ పథకాలు కొనసాగనున్నాయి. కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పథకానికి రూ.200 కోట్లు కేటాయించడంతో రక్తహీనతతో బాధపడుతున్న మహిళలు, గర్భిణులకు ఈ కిట్‌తో పోషకాహారం అందనుంది. స్థానిక సంస్థలకే ఫైనాన్స్ కమిషన్ నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. జిల్లాలో 311గ్రామ పంచాయతీలకు నిధులు సమకూరనున్నాయి.



గూడెం ఎత్తిపోతల పథకం

### సాగునీటి ప్రాజెక్టులకు నిధుల ప్రతిపాదనలు

| ప్రాజెక్టు | ప్రతిపాదిత నిధులు |
|---|---|
| నీల్వాయి | రూ.6.01కోట్లు |
| గొల్లవాగు | రూ.61లక్షలు |
| ర్యాలీవాగు | రూ.30లక్షలు |

### ఆయిల్‌పాంకు ప్రోత్సాహం



కోటపల్లిలో ఆయిల్‌పాం తోట(ఫైల్)

రాష్ట్ర వ్యాప్తంగా 20లక్షల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు లక్ష్యంగా ఉండడంతో జిల్లాలోనూ ఆయిల్ పాం రైతులకు ఊరట కలుగనుంది. ఈ బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు ప్రతిపాదించారు. జిల్లాలో 2,442ఎకరాల లక్ష్యం ఉండగా ఇప్పటివరకు 1,077ఎకరాల్లో మొక్కలు నాటా రు. పరిశ్రమల శాఖ పరిధిలో ఫుడ్ జోన్లకు రూ.40,37 కోట్లు కేటాయించారు. బెల్లంపల్లి శివారులో 355 ఎకరాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిటు ఏర్పాటవుతోంది. ఈ నిధులతో ఔత్సాహిక వ్యాపారులకు ఫుడ్ జోన్లలో వసతుల కల్పనకు వీలు కలుగుతుంది. రాష్ట్ర వ్యవసాయ శాఖకు రూ.26,831 కోట్లు కేటాయించడంతో జిల్లా వరకు ఈ కేటాయింపులు వస్తాయా? అనేది సందేహంగా మారింది.

### రోడ్లకు మోక్షం



గత వానాకాలంలో దెబ్బతిన్న రోడ్డు

ఈసారి బడ్జెట్‌లో రోడ్లకు నిధుల కేటాయింపు ప్రతిపాదనలు పెరిగాయి. రాష్ట్రంలో ఆర్‌అండ్‌బీ రోడ్లకు రూ.2,500 కోట్లకు ప్రతిపాదించా రు. దీంతో జిల్లాలోనూ రోడ్లకు మోక్షం కలుగనుంది. గత కొన్నేళ్లుగా పూర్తి స్థాయిలో రోడ్లు, వంతెనలు అందుబాటులో రాక, రవాణాకు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఇప్పటికీ వేమనపల్లి, కోటపల్లి, భీమిని, నెన్నెల మండలాల్లో అన్ని కాలాల్లో రవాణా సాగేంచే రోడ్డు మార్గాలు లేవు. పంచాయతీరాజ్ శాఖకు నిధుల ప్రతిపాదనతో ఆ శాఖ పరిధిలోని రోడ్లు మెరగవనున్నాయి. గత వానాకాలంలో కురిసిన వర్షాలకు అనేక చోట్ల రోడ్లు దెబ్బతిన్నాయి. కల్వర్టులు కొట్టుకుపోయాయి, రోడ్డు డ్యాం, కాజ్‌వేలకు తాత్కాలిక మరమ్మతులు చేశారు. ప్రతిపాదిత నిధులతో రవాణా మెరగవనుంది.

### రైతన్నకు కాస్త ఊరట



రుణమాఫీ కోసం ఈ బడ్జెట్‌లో రూ.6,385కోట్లు కే టాయించారు. జిల్లాలో ఇంకా రూ.50వేల నుంచి రూ. లక్ష లోపు రుణం తీసుకున్న రైతుల రుణం మాఫీ కావాల్సి ఉంది. త్వరలోనే రుణమాఫీ ప్రక్రియ ప్రారంభం కానుంది. రైతుబంధుకు రూ. 1,575 కోట్లు కేటాయించారు. జిల్లాలో 1.17లక్షల మంది రైతుబంధు పొందుతున్నారు. రైతు బీమా పథకానికి రూ.1,589 కోట్లు, ఈ పథకంలో ఇప్పటివరకు 88వేల మందిపైగా రైతులకు పరిహారం దక్కింది. జిల్లాలో గొల్లవాగు, ర్యాలీవాగు, నీల్వాయి సాగునీటి ప్రాజెక్టులకు నిధులు ప్రతిపాదించడంతో ఆయకట్టుకు నీరందించే అవకాశం ఏర్పడింది.

### ఎన్నికల్లో లబ్ధిపొందే బడ్జెట్



మంచిర్యాలటౌన్: వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే బడ్జెట్ ప్రవేశపెట్టారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రుణమాఫీ పూర్తిగా చేస్తామన్న హామీల ఊసేలేదు. దళిత బంధు మాదిరిగానే గిరిజన బంధు ఇస్తామన్న హామీ, నిరుద్యోగ భృతిపై స్పష్టత ఇవ్వలేదు. విద్యకు తక్కువ బడ్జెట్‌ను కేటాయించారు. ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడేది కాదు. రైతులకు 24 గంటల విద్యుత్ ఇస్తామన్న హామీని నెరవేర్చలేదు. – కొక్కిరాల సురేఖ, డీసీసీ అధ్యక్షురాలు

### హామీలు నెరవేర్చని బడ్జెట్



మంచిర్యాలటౌన్: కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా జిల్లాకు ఒక చుక్క నీరు రాదు. ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో చెన్నూరు, నస్పూరు, మంచిర్యాల, లక్సెట్టిపేట, దండేపల్లి వరకు ముంపునకు గురై ప్రజలు నష్టపోతున్నారు. వారిని ఆదుకునేలా ఎలాంటి చర్యలు లేవు. గోదావరి అంతర్గాం బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటిస్తున్నా వాటిని పేపర్‌కే పరిమితం చేస్తున్నారు. లక్ష్మీ థియేటర్ నుంచి హమాలీవాడ మీదుగా రైల్వే ఓవర్‌బ్రిడ్జి నిర్మాణానికి నిధులు లేవు. ఇచ్చిన హామీలు నెరవేర్చని బడ్జెట్ ఇది. – రఘునాథ్ వెరబెల్లి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

### నిరుద్యోగులకు నిరాశ



బెల్లంపల్లి: రాష్ట్ర బడ్జెట్ అంకెల్లో జనరంజకంగా కనిపిస్తున్నా ఆచరణలో సాధ్యమయ్యేనా అనే అనుమానాలు కలుగుతున్నాయి. నిరుద్యోగులకు భృతి ఇస్తారనే ఆశతో ఉన్నా బడ్జెట్‌లో ప్రస్తావన లేకపోవడం బాధ కలిగించింది. సామాన్యులకు ఉపయోగం లేదు. రాష్ట్ర బడ్జెట్ నిరుద్యోగులకు చేదునే మిగిల్చింది. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తయారు చేసినట్లుంది. – షేక్ అంకూస్, పీజీ విద్యార్థి, కాసిపేట

## న్యూస్‌రీల్

### కేజీబీవీల్లో మెరుగైన ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు

మంచిర్యాలఅర్బన్: మెరుగైన ఫలితాలు సాధించేందుకు విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని డీఈవో వెంకటేశ్వర్లు కేజీబీవీ ప్రత్యేక అధికారులకు సూచించారు. సోమవారం కేజీబీవీ ప్రత్యేక అధికారులతో సమీక్ష నిర్వహించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, ఉపాధ్యాయులు బోధనపై నిర్లక్ష్యం వహించకుండా విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. కేజీబీవీల్లో సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ఏమైనా మరమ్మతులు, ఇతరత్రా పనులుంటే తమ దృష్టికి లిఖిత పూర్వకంగా తీసుకురావాలని సూచించారు. ఇటీవల కాలంలో కొన్ని కేజీబీవీల్లో జరుగుతున్న సంఘటనలు పునారావృతం కాకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సెక్టోరల్ అధికారి సఫ్దర్‌అలీఖాన్ పాల్గొన్నారు.

### 'పది' పరీక్ష ఫీజు చెల్లించాలి

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు ఫీజు చెల్లించాలని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఇప్పటివరకు పరీక్ష రుసుం చెల్లించని రెగ్యులర్ విద్యార్థులతోపాటు గతంలో ఫెయిలైన విద్యార్థులు తత్కాల్ ద్వారా ఈ నెల 15లోపు రూ.1000 జరిమానా చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల విభాగం అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

మంచిర్యాలఅగ్రికల్చర్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక మంగళవారం నిర్వహించనున్నట్లు జిల్లా విద్యుత్ శాఖ ఎస్‌ఈ శేషారావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్‌ఈఆర్సీ) తన్నీరు రంగరావు అధ్యక్షతన ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జిల్లా కేంద్రంలోని కాలేజ్‌రోడ్ పద్మనాయక మినీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. బిల్లులో హెచ్చుతగ్గులు, లో ఓల్టేజ్, విద్యుత్ స్తంభాలు మార్చడం, సరఫరాలో అంతరాయం తదితర వినియోగదారులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలపై సంప్రదించి పరిష్కారం పొందాలని తెలిపారు.

### గూడెంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు



రథోత్సవంలో పాల్గొన్న అర్చకులు, సిబ్బంది

దండేపల్లి: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో గత నెల 30న ప్రారంభమైన స్వామివారి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు సోమవారం రథోత్సవంతో ముగిశాయి. రథోత్సవానికి ముందు స్వామివారల ఉత్సవ విగ్రహాలకు గోదావరినదిలో చక్రస్నానం చేయించి అలంకరించారు. ఉత్సవ విగ్రహాలతో రథోత్సవం ముందు అర్చకుల నృత్యాలు ఎంతగానో అలరించాయి. సప్తాహ భజనలను పరిసమాప్తం చేశారు.

### శాలివాహన పవర్‌ప్లాంటు కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న ప్లాంటు కార్మికులు

పాతమంచిర్యాల: పాతమంచిర్యాలలోని శాలివాహన గ్రీన్ ఎనర్జీ పవర్‌ప్లాంటు పవర్ పర్చేజ్ అగ్రిమెంటు పొడిగించాలని కార్మికులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయం ఏవో సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శాలివాహన గ్రీన్ ఎనర్జీ పవర్‌ప్లాంటు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కుంటాల శంకర్ మాట్లాడుతూ ఒప్పందం ముగియడంతో గత డిసెంబర్‌లో విద్యుత్ సరఫరా, ఉత్పత్తి నిలిపివేశారని తెలిపారు. మూడు నెలలు కావస్తున్నా పీపీఏపై యాజమాన్యం స్పందించకపోవడంతో కార్మికులు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. కలెక్టర్ స్పందించి పీపీఏను మరో పదేళ్లు పొడగించి కార్మికులు రోడ్డున పడకుండా చూడాలని కోరారు. మూడు నెలల వేతన బకాయిలు, మూడేళ్ల బోనస్ ఇప్పించాలని పేర్కొన్నారు. యూనియన్ కార్యదర్శి సత్యనారాయణ, ప్రకాష్, కార్మికులు ఆనందరావు, తిరుపతి, శంకర్, శ్రీనివాస్, చెట్టి శ్రీనివాస్, మల్లయ్య, పెంట సత్యం పాల్గొన్నారు.

# పన్ను వసూళ్లలో ఆర్టీఏ దూకుడు



జిల్లా రవాణా శాఖ కార్యాలయం

- లక్ష్య సాధనలో ముందంజ
- ఆర్థిక సంవత్సర లక్ష్యం రూ.55.86 కోట్లు
- జనవరి నాటికి రూ.50.37 కోట్లు వసూలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రవాణా శాఖ పన్ను వసూళ్లలో జిల్లా ఆర్టీఏ అధికారులు ముందంజలో ఉన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం విధించిన లక్ష్యం కంటే ఎక్కువ మొత్తంలో వసూలు చేసి జిల్లాను రాష్ట్రంలోనే ముందు వరుసలో నిలబెడుతున్నారు. ఆర్టీఏ కార్యాలయంలో సిబ్బంది కొరత ఉన్నా నిర్దిష్టమైన ప్రణాళిక ముందుకు సాగుతున్నారు. సాధారణ విధులతోపాటు ఆకస్మిక తనిఖీలతో పన్ను వసూళ్ల లక్ష్యాన్ని సాధిస్తున్నారు. ప్రతీయేటా రాష్ట్ర స్థాయిలో లక్ష్యాన్ని సాధించి ఉన్నత స్థానంలో నిలుస్తోంది. ఇక 2022 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది 2023 మార్చి 31 వరకు జిల్లా రవాణా శాఖకు ప్రభుత్వం రూ.55.86 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇందులో జనవరి 5నాటికే రూ.50.37 కోట్లు వసూలు చేసింది. ఈ లెక్కన మొత్తం 90శాతం వసూలైంది. ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో రెండు నెలలు ఉంది.

**లక్ష్యానికి చేరువలో..**

జిల్లాలో త్రైమాసిక పన్నుల ద్వారా రూ.12.10 కోట్లు, జీవిత కాల పన్నుల ద్వారా రూ.28.24 కోట్లు, వివిధ రకాల ఫీజుల ద్వారా రూ.7.14 కోట్లు, సర్వీస్ చార్జీల ద్వారా రూ.1.66 కోట్లు, వాహనాల జరిమానాలు, అధిక లోడ్, పత్రాలు లేకుండా, డ్రైవర్ లైసెన్స్ లేకుండా తిరిగే వాహనాలకు జరిమానాలు విధించడానికి చేసిన తనిఖీల ద్వారా రూ.1.56 కోట్లు వసూళ్ల చేశారు. త్రైమాసిక, జీవిత కాల పన్నులతోపాటు ఫీజులు, తనిఖీల ద్వారా రూ.50.37 కోట్ల ఆదాయం రాగా ఈ పన్నుల రూపంలోనే ఆర్టీఏకు అత్యధికంగా ఆదాయం వచ్చింది.

**అధిక లోడ్.. పత్రాలు..**

జిల్లాలో జాతీయ రహదారి ఉండడంతో అత్యధిక లోడ్ కలిగిన వాహనాలు నిత్యం రవాణా సాగిస్తూ ఉంటాయి. ఆ వాహనాలపై ఆర్టీఏ శాఖ ప్రతీసారి కొరడా ఝుళిపిస్తూ వస్తోంది. పత్రాలు లేని వాహనాలు కూడా అధిక సంఖ్యలో తిరుగుతుండడంపై కూడా జరిమానాలతో వసూళ్లు చేస్తున్నారు. ఇలాంటి వాహనాల కోసం ప్రత్యేక కార్యాచరణతో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు.

### కేసులు పెరగడంతోనే..



ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే 90 శాతానికి పైగా పన్నులు వసూళ్లు చేశాం. విజిలెన్స్‌తోపాటు ఆర్టీఏ బృందాలు అధిక కేసులు రాయడం వల్ల కూడా రవాణా శాఖకు ఆదాయం పెరిగింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు పన్నుల వసూళ్లలో రాజీ పడకుండా వసూళ్లు చేస్తున్నాం. జిల్లాలో నిత్యం ఆకస్మిక తనిఖీలు చేపడుతూ జరిమానాల ద్వారా భారీ వసూళ్లు చేస్తున్నాం. పన్ను చెల్లింపులో ఎవరూ నిర్లక్ష్యం చేయకుండా అవగాహన కల్పిస్తూ సకాలంలో చెల్లించేలా చూస్తూ లక్ష్య సాధనలో ముందు ఉన్నాం.

– ఎల్.కిష్టయ్య, డీటీఓ, మంచిర్యాల

# సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ బాదావత్ సంతోష్
- ప్రజావాణిలో అర్జీల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల సత్వరమే పరిష్కారం దిశగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో ట్రెయినీ కలెక్టర్ పి.గౌతమితో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

- ఫిష్‌పాండ్ నిర్వహిస్తున్న తనకు రాయితీ ఇప్పించాలని కాసిపేట మండలం కోమటిచేను గ్రామానికి చెందిన రామటెంకి అనూష కోరింది.
- జిల్లాలో పని చేస్తున్న పార్ట్‌టైమ్ కార్మికులకు జీవో ఎంఎస్ నంబరు 64 ప్రకారం వేతనం పెంచి చెల్లించాలని అర్జీ సమర్పించారు.
- జైపూర్ మండలం రామరావుపేట గ్రామానికి చెందిన మోతే గౌరిదేవి టీలా నిర్మాణానికి స్థలం ఇప్పించాలని కోరింది.
- 2021లో తన భర్త కోవిడ్‌తో మృతిచెందాడని, ఇంతవరకు పరిహారం అందలేదని, పరిహారం ఇప్పించాలని హాజీపూర్ మండలం దొనబండ గ్రామానికి చెందిన యెసంత శంకరమ్మ దరఖాస్తు అందజేసింది.
- భూమి కౌలుకు ఇస్తే తనకు తెలియకుండా వారి పేరిట మార్చుకున్నారని, విచారణ జరిపి న్యాయం చేయాలని దండేపల్లి మండలం చింతపల్లి గ్రామానికి చెందిన గడ్డం రాజలింగు కోరారు.
- లక్సెట్టిపేట మండలం లక్ష్మీపూర్ గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు.
- ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా జరిగేలా చూడాలని ఎస్సీ, ఎస్టీ టీచర్స్ యూనియన్ తెలంగాణ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. యూనియన్ డైరీ ఆవిష్కరించారు. ఎస్సీ, ఎస్టీ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జాదవ్ వెంకట్రావ్, ప్రధాన కార్యదర్శి దూడ రాజనర్సు బాబు, బంద్ర లక్ష్మణ్‌రావు, రాజేశ్‌నాయక్, రమేష్‌నాయక్, లంబాడా హక్కుల పోరాట సమితి నాయకులు ప్రకాష్‌నాయక్ పాల్గొన్నారు.

# గిరిజనులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



రిలేనిరాహార దీక్షలో సేవాలాల్ సేన నాయకులు

పాతమంచిర్యాల: రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు గుగులోత్ మల్లేష్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన గిరిజనుల సమస్యల పరిష్కారానికి ఎస్టీ కమిషన్, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, గిరిజన బంధు అమలు చేయాలని అన్నారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, ఫిబ్రవరి 15న సంత్‌సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. నిరాహారదీక్షకు బీజేపీ నాయకులు అందుగుల శ్రీనివాస్ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా మహిళా అధ్యక్షురాలు ఇస్లావత్‌జ్యోతిబాయి, రాష్ట్ర కార్యదర్శి బానోత్ సరోజ, సేవాలాల్ సేన జిల్లా ఉపాధ్యక్షుడు గజానంద్, నాయకులు ధరావత్ శంకర్‌నాయక్, ఆజ్మీర తిరుపతి, భూక్యారాం నాయక్, బూక్యా శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 'టోల్' వసూలుపై నోటీసులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జాతీయ రహదారి 363 నిర్మాణ పనులు పూర్తి కాకుండానే మందమర్రి శివారులో టోల్ ప్లాజా వద్ద రుసుం వసూలు చేయడంపై సోమవారం జాతీయ రహదారి పీడీ, టోల్ ప్లాజా మేనేజర్‌కు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నోటీసులు జారీ చేసింది. ప్రతివాదులు ఈ నెల 25న ఉదయం 10.30గంటలకు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ముందు ప్రత్యక్షంగా హాజరు కావాలని ఆదేశించింది. గత డిసెంబర్ 30 నుంచి జాతీయ రహదారిని వినియోగిస్తున్న వాహదారుల నుంచి రుసుము వసూలు చేస్తున్నారు. దీనిపై అభ్యంతరం తెలుపుతూ గత నెల 4న బెల్లంపల్లికి చెందిన న్యాయవాది చేను రవికుమార్ రహదారి పనులు పూర్తి కాకుండానే డబ్బులు వసూలు చేస్తున్నారని న్యాయ సేవాధికార సంస్థలో ఫిర్యాదు చేయడం తెలిసిందే. ఈ ఫిర్యాదుపై విచారణ జరగనుంది.

# కాంగ్రెస్ హాథ్ సే హాథ్ జోడోయాత్ర



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని తిలక్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ సోమవారం హాథ్ సే హాథ్ జోడోయాత్ర ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసి యాత్రను ప్రారంభించి ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ విజయాలు, మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు చేపడుతున్న సేవా కార్యక్రమాలు ప్రజలకు వివరించారు. రాహుల్‌గాంధీ జోడో యాత్రకు మద్దతుగానే రాష్ట్ర కాంగ్రెస్ పిలుపు మేరకు జోడో యాత్రను జిల్లాలో ప్రారంభించినట్లు తెలిపారు.

## భాషా పండితుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న భాషా పండితులు

మంచిర్యాలఅర్బన్: దశలవారీ ఆందోళనలో భాగంగా భాషా పండితులు సోమవారం డీఈవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. భాషా పండితులు, పీఈటీలకు పదోన్నతులు కల్పించాలని వారం రోజులుగా 9, 10వ తరగతులకు బోధించకుండా సహాయ నిరాకరణ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రాష్ట్రీయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణచారి మాట్లాడుతూ భాషా పండితులకు పదోన్నతులు కల్పించే వరకు 9, 10వ తరగతులకు బోధించబోమని తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, వేణుగోపాల్, శ్రీనివాసవర్మ, వేదాంతం విశ్వప్రసాద్, నీల్‌కమల్, పీఈటీ అసోసియేషన్ జిల్లా బాధ్యులు శ్రీనివాస్, గోపాల్, శ్రీనివాస్, శ్రీధర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### గిరిజన యువతకు ఉచిత శిక్షణ

ఆసిఫాబాద్‌అర్బన్‌: ఆదివాసీ చిత్రకళలు, గోండి పెయింటింగ్స్‌లో గిరిజన యువతకు రెండు నెలలపాటు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఆసక్తి గల నిరుద్యోగ యువతీ, యువకులు పదోతరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్‌, ఆధార్‌ కార్డు, కులధ్రువీకరణ పత్రాలతో ఉట్నూర్‌ కేబీ కాంప్లెక్స్‌లోని యూత్‌ ట్రైనింగ్‌ సెంటర్‌లో ఈ నెల 10న హాజరుకావాలని సూచించారు. శిక్షణ అనంతరం వివిధ ప్రైవేటు సంస్థల్లో ఉపాధి కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఐటీడీఏ జాబ్‌ డిస్ట్రిక్‌ మేనేజర్‌ను 9032839993 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### కేజీబీవీని పరిశీలించిన డీఐఈవో

చెన్నూర్‌: చెన్నూర్‌లోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయం జూనియర్‌ కళాశాలను మంచిర్యాల డీఐఈవో శైలజ సోమవారం పరిశీలించారు. విద్యార్థుల వివరాలు, హాజరు, ప్రత్యేక తరగతులపై అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో కలియ తిరిగారు. విద్యార్థులు భయం వీడి పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. డీఐవో అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు సమాధానాలు చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్‌ సుమలత పాల్గొన్నారు.

### జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న జెడ్పీటీసీ

జన్నారం(ఖానాపూర్‌): ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో జన్నారం మండల కేంద్రానికి చెందిన విద్యార్థులు సత్తా చాటారు. ఖోఖో జూనియర్‌ విభాగంలో రాఘవేంద్ర లిటిల్‌ హాన్స్‌ స్కూల్‌ విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్‌ శ్రీనివాస్‌ తెలిపారు. క్యారమ్‌ సీనియర్స్‌ బాలికల విభాగంలో స్లేట్‌ హైస్కూల్‌కు చెందిన సునంద, విజ్ఞశ్రీ ప్రథమ బహుమతి, సీనియర్‌ విభాగంలో రిత్విక్‌, రాధ ప్రథమ బహుమతి సాధించారు.

### పోక్సో కేసులో ఒకరికి 18 నెలల జైలు

మంచిర్యాలక్రైం: పోక్సో కేసులో ఒకరికి 18 నెలల జైలుశిక్ష విధిస్తూ జిల్లా మొదటి అదనపు సెషన్స్‌ కోర్టు జడ్జి జే.మైత్రేయి సోమవారం తీర్పునిచ్చినట్లు సీఐ.నారాయణ్‌నాయక్‌ తెలిపారు. 2021 జూలై 10న జిల్లా కేంద్రంలోని జాఫర్‌ నగర్‌కు చెందిన ఓ బాలికపై అదేనగర్‌కు ఎస్‌కే.యాకూబ్‌ అత్యాచారయత్నం చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. అప్పటి ఇన్వెస్టిగేషన్‌ అధికారి ఏసీపీ అఖిల్‌ మహాజన్‌ కేసు విచారణ జరిపి సాక్షాధారాలతో చార్జిషీట్‌ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో జైలుశిక్ష విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు.





# చీటర్స్‌పై నిఘా!

మంచిర్యాలకు చెందిన ఓ మహిళపై మందమర్రికి చెందిన గాదాసు విజయ్‌కుమార్‌ వాట్సాప్‌ ద్వారా అసభ్యకరమైన మెసేజ్‌లు పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తుండడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు మంచిర్యాల పోలీస్‌ స్టేషన్‌లో సదరు యువకుడిపై కేసు నమోదైంది.

జిల్లాకు చెందిన ఓ ప్రముఖ నాయకుడు తనను పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడంటూ ఓ మహిళ సోషల్‌ మీడియా ద్వారా ప్రచారం చేసింది. అసత్య ప్రచారం అంటూ సదరు నాయకుడు మంచిర్యాల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ అనంతరం సదరు మహిళపై పోలీసులు కేసు నమోదు చేశారు.

**రామగుండం కమిషనరేట్‌లో నమోదైన సోషల్‌ మీడియా కేసులు**

| సంవత్సరం | కేసులు | అరెస్ట్‌ |
| --- | --- | --- |
| 2021 | 58 | 65 |
| 2022 | 24 | 21 |
| మొత్తం | 82 | 86 |

- సోషల్‌ మీడియాలో అసత్య ప్రచారాలు
- నిఘా కట్టుదిట్టం చేసిన పోలీసులు
- కమిషనరేట్‌ పరిధిలో కేసులు నమోదు

మంచిర్యాలక్రైం: ఆధునిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో అంతర్జాల వినియోగం సర్వసాధారణమైంది. ప్రతిఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్లు సందడి చేస్తున్నాయి. ఈ క్రమంలో తమ అభిప్రాయాలు, ఆలోచనలు పలువురితో పంచుకునేందుకు సామాజిక మాధ్యమాలను వేదికగా మలుచుకుంటున్నారు. అయితే కొంతమంది మరీ హద్దుమీరి ప్రవర్తిస్తున్నారు. ఇతరులను రెచ్చగొట్టేలా అభ్యంతరకరమైన సందేశాలు, అసత్య ప్రచారాలు, వ్యక్తిగత ఆరోపణలు పోస్ట్‌ చేస్తున్నారు. సోషల్‌ షీటర్ల ఆగడాలకు కళ్లెం వేసేందుకు రామగుండం పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలోని పోలీస్‌ అధికారులు షీటర్లపై కేసులు నమోదు చేస్తున్నారు. ఇప్పటికే కమిషనరేట్‌ పరిధిలో 82 కేసులు నమోదు కాగా 85 మందిని అరెస్ట్‌ చేశారు. సోషల్‌ మీడియాను వేదికగా చేసుకుని యువతను రెచ్చగొడుతూ తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్న అల్లరి మూకలపై పోలీసులు నిఘా కఠినతరం చేశారు.

**పలువురికి ఇబ్బందులు**

ఎవరికి వారు తమ ఆలోచనలను సోషల్‌ మీడియాలో పొందుపరుస్తున్నారు. కొందరైతే కొన్ని వర్గాలను, రాజకీయ పార్టీలకు చెందిన నాయకులను టార్గెట్‌ చేసుకుంటున్నారు. మరికొందరు మహిళలు, యువతులను కించపరిచేలా వ్యవహరిస్తున్నారు. కుప్పలుకుప్పలుగా పుట్టుకువస్తున్న కొన్ని యూట్యూబ్‌ చానళ్లు కూడా ఇదేపంథాలో వెళ్తున్నాయి. ఈ పరిణామాలతో అనేక మందికి ఏది అసత్యమో.. ఏది అసత్యమో తెలియక అయోమయానికి గురవుతున్నారు. వీరిలో అతితక్కువ మంది మాత్రమే పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. దీనిని అలుసుగా తీసుకుంటున్న అనేకమంది చీటర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

**పక్కాగా నిఘా**

సోషల్‌ మీడియాను వేదికగా చేసుకుని తమ కార్యకలాపాలు సాగిస్తున్న వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. సోషల్‌ షీటర్ల కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి వారిని గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. బాధితుల ఫిర్యాదుపై ఇప్పటికే అదుపులోకి తీసుకున్న వారిపై కేసులు నమోదు చేసి ఇకనైనా పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. వారితో కాంటాక్ట్‌లో ఉన్న వారి సెల్‌ఫోన్‌ నంబర్లు సేకరించి వారి జాబితాను సైతం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. సోషల్‌ మీడియాలో తమ అభిమాన రాజకీయ నాయకులపై ఇతర పార్టీలకు చెందిన నాయకులు విమర్శలు చేయడం, వాటిపై కార్యకర్తలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం, కొన్ని సందర్భాల్లో ఉద్వేగాలకు లోనైన కొందరు హద్దుమీరి శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా పోస్టులు పెడుతున్నారు. ఇలాంటి పోస్టులపై ప్రత్యేక పోలీసు బృందం ఓ కన్నేసి ఉంచుతోంది. రౌడీలు, ఆకతాయిలు, మందుబాబులు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించడం, వారి వివరాలు సేకరించడం చేస్తున్నారు.

**శిక్ష పడేవరకూ పర్యవేక్షణ**



సోషల్‌ మీడియాలో అవాంఛనీయ పోస్టులపై కేసులు నమోదుతో సరిపెట్టకుండా నిందితులకు శిక్ష పడేవరకూ పర్యవేక్షణ ఉంటుంది. ప్రతీ కేసును చట్టప్రకారం దర్యాప్తు చేసి నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటాం. వాట్సాప్‌, ట్విట్టర్ల ద్వారానే ఇలాంటి సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి. వాట్సాప్‌లో ఉండే గ్రూపులే వదంతుల విస్తరణకు కారణమవుతున్నాయి. ఏ సమాచారమైనా పూర్తిగా నిర్ధారించుకోకుండా ప్రచారం, షేరింగ్‌ చేయవద్దు. అలా చేస్తే ఇన్ఫర్మేషన్‌ టెక్నాలజీ యాక్ట్‌ 2000 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– రెమా రాజేశ్వరి, రామగుండం పోలీస్‌ కమిషనర్‌

# రాష్ట్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు 2023–24 వార్షిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. దీనిపై వివిధ రాజకీయ పార్టీలు, విద్యార్థి, ప్రజా సంఘాల నాయకుల అభిప్రాయాలు వారి మాటల్లోనే...

**ఉద్యోగులకు నిరాశే**



రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో ఉద్యోగులకు నిరాశే మిగిలింది. విద్య, వైద్య రంగాలకు తక్కువ కేటాయించింది. ఉద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న పాతపింఛన్‌ విధానం పునరుద్ధరణపై ఎలాంటి హామీ ఇవ్వలేదు.

– రంగు రాజేశం, ఉద్యోగ సంఘాల సమన్వయ సమితి ఉమ్మడి జిల్లా కన్వీనర్‌

**ఏటా తగ్గింపులే**



మంచిర్యాలఅర్బన్‌: గత బడ్జెట్‌తో పోలిస్తే కేవలం 3,051 కోట్ల తేడా మాత్రమే ఉంది. కొఠారి కమీషన్‌ నివేదిక ప్రకారం విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని చెబుతున్నా ప్రభుత్వం ఏటా తగ్గిస్తూ వస్తోంది.

– సన్నీగౌడ్‌, విద్యార్థి సంఘం నాయకుడు

**విద్యారంగానికి అంతంతే.**



మంచిర్యాలఅర్బన్‌: విద్యారంగానికి బడ్జెట్‌ తగ్గించటం శోచనీయం. మొత్తం బడ్జెట్‌లో 10 శాతం కేటాయించినా 29,039 కోట్లు విద్యారంగానికి దక్కేవి. మన ఊరు–మనబడి కోసం అదనపు కేటాయింపులు లేవు.

– జయకృష్ణ, డీటీఎఫ్‌ నాయకుడు

**కార్మిక రంగాన్ని విస్మరించారు**



బెల్లంపల్లి: బొగ్గు గనుల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోనున్నారో వెల్లడించలేదు. కార్మిక వర్గ ప్రయోజనాలను కాపాడటానికి తగినన్ని నిధుల కేటాయింపు లేదు. కొత్త గనుల ఊసే ఎత్తలేదు. అసంఘటిత కార్మికుల ప్రస్తావనే రాలేదు.

– దాగం మల్లేశ్‌, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి, బెల్లంపల్లి

**పేదల సంక్షేమ బడ్జెట్‌**



నస్పూర్‌: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ పేదలు, రైతులు, బడుగు, బలహీన వర్గాలకు లబ్ధి చేకుర్చేలా ఉంది. అధికశాతం నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రశేఖరరావుకి ధన్యవాదాలు. దళితబంధు, గృహ నిర్మాణానికి రూ.3 వేల కోట్లు కేటాయించడం హర్షనీయం.

– తోట శ్రీనివాస్‌, మున్సిపల్‌ వైస్‌చైర్మన్‌

**బీసీలకు అన్యాయం**



పాతమంచిర్యాల: బడ్జెట్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం చేశారు. 52 శాతం ఉన్న బీసీలకు రూ.6,229 కోట్లు మాత్రమే కేటాయించారు. ప్రభుత్వ ప్రకటనలకు గతంలో కంటే పది రెట్లు అధికంగా కేటాయించారు. బీసీల ఓట్లతో గద్దెనెక్కిన ప్రభుత్వాలు బడ్జెట్‌లో మాత్రం మోసం చేస్తున్నాయి.

– రాంశెట్టి నరేందర్‌,

**రుణమాఫీపై స్పష్టత లేదు**



పాతమంచిర్యాల: రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రైతుల రుణమాఫీకి ఎంత కేటాయించారన్నదానిపై స్పష్టత ఇవ్వలేదు. పేదల ఇంటి నిర్మాణాలకు రూ.3లక్షలు సరిపోవు. రూ.5 లక్షలు కేటాయిస్తే పేదలకు ఊరట లభించేది. వివిధ ఏజెన్సీలలో పనిచేసే ఉద్యోగులకు ఈ బడ్జెట్‌లో అన్యాయం జరిగింది.

– ఖలిందర్‌ అలీఖాన్‌, సీపీఐ పట్టణ కార్యదర్శి, మంచిర్యాల

**కేటాయించిన నిధులు ఖర్చుచేయాలి**



మంచిర్యాలఅర్బన్‌: బడ్జెట్‌ కేటాయింపుతోనే సరికాదు.. నిధులు సక్రమంగా వినియోగించాలి. విద్యారంగానికి ప్రాధాన్యం ఇచ్చినట్లుంది. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తారని ఆశిస్తున్నా. కేటాయించిన నిధులు మొత్తం ఖర్చు చేయాలి.

– గోళ్ల రామన్న, ఉపాధ్యాయ సంఘం నాయకుడు

### ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కోటపల్లి(చెన్నూర్‌): ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పుల్లగామలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నల్లగుంట బాపు (50) మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పని నిమిత్తం బయటకు వెళ్లిన భార్య లక్ష్మి ఇంటికి వచ్చి చూడగా ఉరేసుకుని కనిపించాడు. లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెంకట్‌ తెలిపారు.

### తల్లిదండ్రులు మందలించారని విద్యార్థిని..

కాసిపేట(బెల్లంపల్లి): తల్లిదండ్రులు మందలించారని ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గుండ్లపహాడ్‌లో చోటు చేసుకుంది. ఎస్సై గంగారాం తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పేంద్రం కిషన్‌ కుమార్తె అంకిత (16) ఆసిఫాబాద్‌లోని ఎస్టీ గిరిజన ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఇటీవల సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చింది. అప్పటి నుంచి హాస్టల్‌కు వెళ్లడం ఇష్టంలేక ఇంటివద్దే ఉంటోంది. హాస్టల్‌కు వెళ్లమని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురైంది. ఆదివారం రాత్రి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేసింది. అందరూ పడుకున్న తర్వాత ఇంటిముందున్న దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సోమవారం తెల్లవారుజామున నిద్రలేచిన కిషన్‌ తలుపు తెరిచి చూసే సరికి ప్లాస్టిక్‌ తాడుతో దూలానికి ఉరేసుకుని కనిపించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### ట్రాక్టర్‌, ఆర్టీసీ బస్సు ఢీ

కాగజ్‌నగర్‌టౌన్‌: పట్టణంలోని రైల్వే ఫ్లైఓవర్‌ బ్రిడ్జిపై సోమవారం జరిగిన ట్రాక్టర్‌, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో పారిశుద్ధ్య కార్మికురాలికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ ట్రాక్టర్‌ కాగజ్‌నగర్‌ పట్టణం నుంచి భట్టుపల్లి చౌరస్తా వైపు వెళ్తుండగా కాగజ్‌నగర్‌ నుంచి పెంచికల్‌పేట్‌ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఘటన సమయంలో అక్కడే విధులు నిర్వర్తిస్తున్న మున్సిపల్‌ పారిశుద్ధ్య కార్మికురాలు ఇప్ప మల్లుకు గాయాలయ్యాయి.

### ఆర్టీసీ బస్సు బోల్తా



బోల్తా పడిన ఆర్టీసీ బస్సు

ఆసిఫాబాద్‌: జిల్లా కేంద్రంలోని పెద్దవాగు సమీపంలోని మూల మలుపు వద్ద సోమవారం తెల్లవారుజామున ఆర్టీసీ సూపర్‌ లగ్జరీ బస్సు బోల్తా పడింది. ఉదయం 6 గంటలకు ఆసిఫాబాద్‌ డిపో నుంచి హైదరాబాద్‌కు బస్సు బయలుదేరింది. డ్రైవర్‌, కండక్టర్‌తో పాటు మరో ముగ్గురు ప్రయాణికులు బస్సులో ఉన్నారు. కిలోమీటర్‌ దూరం వెళ్లగానే డ్రైవర్‌ సదేశ్‌కు ఛాతిలో నొప్పిరావడంతో భయంతో బస్సు దూకాడు. దీంతో బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. కండక్టర్‌ గుండ శ్రీనివాస్‌తో పాటు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో కరీంనగర్‌ ఆస్పత్రికి తరలించినట్లు అసిస్టెంట్‌ డీఎం విశ్వనాథ్‌ తెలిపారు.

# గిరిజనుల సమస్యలు పరిష్కరిస్తాం

- ఐటీడీఏ ఏపీవో జనరల్‌ భీంరావ్‌



గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న భీంరావ్‌

ఉట్నూర్‌: ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తామని ఐటీడీఏ ఏపీవో జనరల్‌ భీంరావ్‌ అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో గిరిజనుల నుంచి 52 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా భీంరావ్‌ మాట్లాడుతూ ప్రతి అర్జీని అధికారులు పరిశీలించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి గిరిజనులకు వైద్యపరీక్షలు నిర్వహించాలన్నారు. ఏపీవో పీవీటీజీ భాస్కర్‌, ఓఎస్‌డీ కిష్టయ్య, జేడీఎమ్‌ నాగాభూషణం హెచ్‌వో సుధీర్‌, డీపీవో ప్రవీణ్‌, ఏవో రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

- దివ్యాంగురాలి పింఛన్‌ మంజూరు చేయాలని గుడిహత్నూర్‌ మండలం దరమడుగుకు చెందిన సిడాం జమునబాయి అర్జీ పెట్టుకుంది.
- రైతుబంధు ఇప్పించాలని జన్నారం మండలం కొత్తపేట్‌కు చెందిన పవార్‌ దినేశ్‌ విన్నవించాడు.
- గిరివికాసం పథకం ద్వారా పంట చేనుకు బోరుబావి, విద్యుత్‌ మోటారు మంజూరు చేయాలని నార్నూర్‌ మండలం బాబేఝరికి చెందిన కుర్సింగ కర్ణుబాయి వేడుకుంది.
- తాను సాగు చేసుకుంటున్న ఆర్‌ఓఎఫ్‌ఆర్‌ అటవీ భూమికి విరాసత్‌ పట్టా చేయాలని జన్నారం మండలం కవ్వాల్‌కు చెందిన కొడప అయ్యుబాయి విన్నవించింది.
- పంట సాగు కోసం ఎడ్ల జత మంజూరు చేయాలని జైనూర్‌ మండలం పోచంలొద్దికి చెందిన ఆత్రం భాస్కర్‌ అర్జీ పెట్టుకున్నారు.

# బొగ్గుబ్లాకుల వేలం అడ్డుకోవాలి

- ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్‌ బి.జనక్‌ ప్రసాద్‌



మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్‌

శ్రీరాంపూర్‌(మంచిర్యాల): సింగరేణిలో బొగ్గు బ్లాకుల వేలం అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలని ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్‌ బి.జనక్‌ప్రసాద్‌ అన్నారు. సోమవారం నస్పూర్‌–శ్రీరాంపూర్‌ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోయగూడెం బొగ్గు బ్లాకును అరబిందో సంస్థకు అప్పగించారని దీన్ని అడ్డుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం చేసిన ఎంఎండీఆర్‌ చట్టానికి సపోర్టు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. సింగరేణిలో పర్సనల్‌, లా డిపార్టుమెంట్‌లు పూర్తిగా నిర్వీర్యం అవుతున్నాయని, వీటిని మెరుగుపర్చాలన్నారు. ఇప్పటికీ సుమారు 3 వేల కేసులు కోర్టుల్లో ఉన్నాయంటే వీరి పనితీరు తెలుస్తోందన్నారు. ఫిట్‌ ఫర్‌ సేమ్‌ జాబ్‌ ఇస్తే మళ్లీ అప్పీలుకు ఏడాది గడువు ఉండాలని నిబంధన పెట్టారని, కానీ ఇంకా 24, 25 నెలలు ఉండగా పంపిస్తే వారు మళ్లీ అప్పీలు చేసుకుని రెండోసారి బోర్డుకు వెళ్లలేక నష్టపోతున్నారని, దీన్ని సవరించాలని డిమాండ్‌ చేశారు. సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని అడ్డుకోవాలన్నారు. కార్మికుల పక్షాన పోరాడే ఐఎన్టీయూసీ వెంట కార్మికులు నడవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆ యూనియన్‌ ప్రధాన కార్యదర్శి కాంపెల్లి సమ్మయ్య, బ్రాంచి ఉపాధ్యక్షుడు జే.శంకర్‌రావు, నాయకులు గరిగె స్వామి, సమ్ము రాజయ్య, తిరుపతి పాల్గొన్నారు.

# బీపీఏలో పర్యటించిన సింగరేణి డైరెక్టర్లు



కైరిగూడ ఓసీపీని సందర్శిస్తున్న డైరెక్టర్లు

రెబ్బెన(ఆసిఫాబాద్‌): బెల్లంపల్లి ఏరియాలోని గనుల్లో సోమవారం సింగరేణి డైరెక్టర్‌(ఆపరేషన్స్‌) ఎంవీకే శ్రీనివాస్‌, డైరెక్టర్‌ (ప్రాజెక్టు అండ్‌ ప్లానింగ్‌) జి.వెంకటేశ్వరరెడ్డి పర్యటించారు. డైరెక్టర్లుగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారి ఏరియా పర్యటనకు వచ్చిన డైరెక్టర్లకు ఏరియా జీఎం దేవేందర్‌తో పాటు ఇతర విభాగాల అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం జీఎం కార్యాలయంలో శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కైరిగూడ ఓసీపీతో పాటు త్వరలో ప్రారంభం కానున్న గోలేటి ఓసీపీ ప్రాంతాలను సందర్శించారు. గోలేటి, మాదారం ఓసీపీ ఏర్పాటుకు చేపడుతున్న చర్యలు, లభించిన అనుమతులపై ఏరియా జీఎంతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం గుప్తా, ప్రాజెక్టు అధికారి ఉమాకాంత్‌, పర్సనల్‌ మేనేజర్‌ లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

**డైరెక్టర్లకు సన్మానం**

బెల్లంపల్లి ఏరియా పర్యటనకు వచ్చిన సింగరేణి డైరెక్టర్లను టీబీజీకేఎస్‌తో పాటు ఏఐటీయూసీ నాయకులు వేర్వేరుగా శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో టీబీజీకేఎస్‌ నాయకులు ప్రకాశ్‌రావు, మంగీలాల్‌, వెంకటేశం, సదాశివ్‌, రమేశ్‌, కుమారస్వామి, ఏఐటీయూసీ నాయకులు మొగిళి, శ్రీనివాస్‌, జగ్గయ్య, చంద్రశేఖర్‌, రాజేశ్‌ పాల్గొన్నారు.

# ‘గుర్తింపు’ ఎన్నికలు నిర్వహించాలని ధర్నా



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్‌(మంచిర్యాల): హైకోర్టు తీర్పును అనుసరించి సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్‌ చేస్తూ ఏఐటీయూసీ నేతలు సోమవారం హైదరాబాద్‌లో డెప్యూటీ చీఫ్‌ లేబర్‌ కమిషనర్‌ కార్యాలయం, సింగరేణి భవన్‌ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ సింగరేణిలో ఎన్నికల కాలపరిమితి ముగిసి మూడేళ్లు కావస్తున్నా ఎన్నికలు నిర్వహించడంలేదన్నారు. ఎన్నికలు నిర్వహిస్తే టీబీజీకేఎస్‌ ఓడిపోతుందనే భయంతో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం సింగరేణిపై ఒత్తిడి తెచ్చి ఎన్నికలు జరుగకుండా కుట్రలు చేస్తోందన్నారు. కోర్టు తీర్పును అనుసరించి వెంటనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్‌ డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు మిర్యాల రంగయ్య, శేషయ్య, ఎస్కే బాజీసైదా, రాజ్‌కుమార్‌, సారయ్య, కే.వీరభద్రయ్య, వైవీ రావు, బ్రాంచి నేతలు కిషన్‌రావు, దాగం మల్లేశ్‌, తిరుపతి, అక్బర్‌ అలీ పాల్గొన్నారు.


# ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్‌ అమలు హర్షనీయం



మాట్లాడుతున్న శ్రీహరి

మంచిర్యాలటౌన్‌: ఉద్యోగులకు నగదు రహిత ఆరోగ్య పథకం (ఈహెచ్‌ఎస్‌) అమలుకు అసెంబ్లీలో ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు ప్రకటన చేయడం హర్షనీయమని టీఎన్జీవోస్‌ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్‌ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, పెన్షనర్లు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న 1 శాతం చందాతో కూడిన నగదు రహిత వైద్య సహాయం ఏర్పాటు చేయాలని టీఎన్జీవోస్‌ సంఘం కోరడంతో రూ.6.50 లక్షల ఆరోగ్య భద్రత కల్పించారన్నారు. సమావేశంలో టీఎన్జీవోస్‌ జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్‌, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# ‘పోడు’ హక్కు పత్రాలు ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వేమనపల్లి: ఏళ్ల తరబడి పోడు భూములు సాగు చేసుకుంటున్న నిరుపేదలకు హక్కు పత్రాలు అందజేయాలని ఏఐకేఎంఎస్‌ రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్‌కుమార్‌ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రోడ్డుపై ధర్నా నిర్వహించి తహసీల్దార్‌ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అటవీ సంరక్షణ నియమాలు 2022ను రద్దు చేయాలని కేంద్రాన్ని కోరుతూ రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేయాలని డిమాండ్‌ చేశారు. పేదలకు హక్కు పత్రాలు ఇవ్వకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి, జిల్లా నాయకులు సత్యం, మండల నాయకులు సమ్మయ్య, సత్యం, శంకర్‌, నగేష్‌, తోకల కిష్టయ్య, బొందయ్య, సంతోష్‌ పాల్గొన్నారు.

# బడ్జెట్‌ కేటాయింపులో బీసీలకు అన్యాయం



మాట్లాడుతున్న గుమ్ముల శ్రీనివాస్‌

పాతమంచిర్యాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని బీసీ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్‌ గుమ్ముల శ్రీనివాస్‌ అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో బీసీలు 56 శాతం ఉంటే వారి సంక్షేమానికి కేటాయించింది కేవలం 2 శాతం మాత్రమే అన్నారు. బడ్జెట్‌ ప్రారంబానికి ముందే బడ్జెట్‌లో బీసీలకు రూ.20 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్‌ చేసినప్పటికీ పట్టించుకోలేదన్నారు. బడ్జెట్‌పై పునఃసమీక్ష చేసి బీసీలకు న్యాయం చేయాలన్నారు. సమావేశంలో తెలంగాణ బలహీన వర్గాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోతే రాజలింగు, బీసీ ఐక్యవేదిక నాయకులు లక్ష్మణ్‌ పాల్గొన్నారు.